# ఇరవైనాలుగ్గంటలు.

'శేషయ్యా?'

'ప్రభూ! నమస్తే!'

'ఈవేళ తారీకెంత?'

'చిత్తం-ముప్ఫయ్యొకటండి.'

'అలాగనా? అంటే ఒహటో తారీకు రేపే నన్నమాట?'

'చిత్తం-అంతేనండి.'

'...............'

'ఏమిటలా అనుమానిస్తున్నారు?'

'ఒహటో తారీకు రేపు కాదేమోనని.'

'రేపేనండి-అబద్ధమాడతానా మీతో?'

'శేషయ్యా! ఒహటో తారీకు రేపు కాదోయ్-ఎల్లుండి-'

'హా ప్రభూ! పొరబడతున్నారు.'

'లేదు లేదు శేషయ్యా! ఒహటో తారీకు ఎల్లుండే-రేపు ముప్ఫయ్యొకటి-ఈవేళ ముప్ఫయి-నిన్న ఇరవైతొమ్మిది-'

'ప్రభువులు పొరబడతున్నారని ముందే మనవి చేసుకున్నా. ఇప్పుడు తమరు ధృవంగా పొరబడటమే గాకుండా నన్ను హడలగొట్టి చంపుతున్నారు కూడాను!'

'లేదు లేదు శేషయ్యా-ఏమీ పొరబాటులేదు. నాఉద్దేశం నువ్వింకా అర్థంచేసు...'

'నా మొహం! అదుగో కేలండరు చూసుకోండి కావలిస్తే-'

'వెధవ కేలండరు! దానికి మనం బానిసల మవకూడదు.'

'అయితే ఈవేళ ముప్ఫయ్యొకటి కాదంటారా? రేపు ఒహటి కాదంటారా? నిన్న ముప్ఫయి కాదంటారా-'

'కాదు కాదు కాదు-మనం ఆ పద్ధతంతా మార్చేస్తున్నాం-'

'...............?'

'ఇంకా నా ఉద్దేశం గ్రహించలేదోయ్ ?'

'నా మొహమండి-నన్ను నలిపి చంపుతున్నారు-'

'విను శేషయ్యా! ఈ వేళటినుంచి మన సంస్థానంలో గడియారాలన్నీ ఇరవై నాలుగ్గంటలు వెనక్కు తిరుగుతాయి-'

'..............?'

'అలా చూడకు-తెలిసిందా ?'

'హయ్యోర్రామ !'

'విను విను విను-మన కామాత్రం అధికారం లేదంటావా?'

'అంతా కావాలాన్ని ఒకగంట ముందుకి తోస్తే మనం ఇలా-'

'ఎవళ్ళ సదుపాయాలు వాళ్ళవి-మన సంస్థానంలో ఇంకటినుంచి కాలం ఇరవై నాలుగ్గంటలు వెనక్కు వేస్తుంది-'

'అంతా ముందుకిపోతూంటే మనం వెనక్కి !'

'అట్టే వ్యాఖ్యానం చేయకు-ఈ వేళ ముప్ఫయ్యో తారీఖని టమటమా కొట్టించు సంస్థానమంతటా-'

'అప్రదిష్ట పని !'

'ముక్కుమీద వేలుతియ్యి. అనంతమైన కాలాన్ని ఒక్క కాయితం ముక్కతో, ఒక్క కలం పోటుతో వెనక్కు మళ్ళించాల్సిన సమయంలో నీ చెయ్యి అప్రయోజనంలేని ముక్కుమీద-'

'ప్రభూ ! ఈ అప్రదిష్టకు పునాది నా చేతిమీదుగా వద్దు-ఇదుగో నా రాజీనామా ఉత్తరం-'

'వెర్రి శేషయ్యా! అంత ఆలోచన లేదేమోయ్ నీ బుర్రకు?'

'ఏ మాలోచించమంటారు నా మొహం ?'

'శేషయ్యా! మన సంస్థానంలో మన ఇష్టం-మన రాజ్యం-మనకి ఎలా సదుపాయంగావుంటే అలాగ కాలాన్ని మార్చుకుంటాను-ఈ వేళ తారీఖు ముప్ఫయ్యే! మళ్ళీ మాట్లాడితే ఇరవైతొమ్మిదే అంటాను-'

'ప్రభువుల శ్రేయస్సు కోరిన నా కడపటి హితవు-ఈ చేష్టలు చూసి అంతా నవ్వుతారు-'

‘నవ్వినవాళ్ల ముక్కులు నులిమేస్తామ్. తుప్పతీస్తామ్-నా సంస్థానం, నా అధికారం, నా...’

‘మీ సంస్థానానికి ఇకనుంచి మంత్రులుకూడా మీరే-ఇదుగో నా రాజీనామా ఉత్తరం-మరి శెలవు-’

‘శేషయ్యా! మూర్ఖుడా! తొందరపడకు-ఇంతకీ ఈ మార్పును నేను ఎందుకు చేస్తున్నానో గ్రహించావా?’

‘పిచ్చాసుపత్రులను నింపడానికి-అందులో నాకూడా తమపక్కన ఒక మంచం వేయించడానికి-’

‘ఛత్! ఆలోచనలేనిమనిషి! ఎక్కడ తగలడ్డదోయి నీ సూక్ష్మబుద్ధంతా? చెప్తున్నావిను-ఈవేళ ముప్ఫయ్యోతారీకు, రేపు ముప్ఫయ్యొకటి, ఎల్లుండి...’

‘హయ్యో! ఎంతగా చెడిపోయింది మీ మెదడు!’

‘శేషయ్యా! ఆగు! నువ్వు రేపే ఒకటోతారీకు అనుకుంటున్నావు కామోసు...?’

‘నా మొహమండి! నా శ్రాద్ధం! నేననుకునే దేమిటీ, కేలండర్లన్నీ కోళ్ళయి కూస్తుంటేనూ?’

‘వెధవ కేలండర్ల ఘూసు మన కెందుకు-అవి మన సౌకర్యాలను గుర్తించవు-’

‘ఇప్పుడు మనకొచ్చిన అసౌకర్యమేమిటండీ?’

‘శేషయ్యా! అలా దారిలోకిరా! రేపు ఒకటోతారీకైతే మన కెంత ప్రమాదమో గుర్తించావా?’

‘ఊహూ! నాకేమీ ప్రమాదం గోచరించడం లేదండి-?’

‘వెధవ మంత్రిత్వం వెలగబెట్టేవులే-ఇంతేనా నీ తెలివితేటలు?’

‘నాకేమీ అర్థంకావటం లేదండి-’

‘ముందు వెళ్ళి టమటమా వేయించు మన కొత్త పద్ధతి ప్రకారం ఒకటో తారీకు ఎల్లుండని-’

'మీరు నన్ను చంపండి, కాల్చండి—ఒక్క ఆఖరు మనవి-ఒకటో తారీకు సశాస్త్రీయంగా రేపే. అది అలా అయితే మనకు వచ్చిన నష్టమేమిటో కాస్త...'

'ఇంకా మెల్లిగా అడుగుతున్నావా? ట్రెజరీ ఖాళీగావుంది. ఇరవై నాలుగ్గంటలలోగా డబ్బువచ్చే సూచనలులేవు. రేపు ఒహటో తారీకైతే మనం అందరికీ జీతా లెలా యిస్తామోయ్ వెర్రివాడా!'

## రాజుగారి కనీసపు కోర్కెలు

'శేషయ్యా!

'సుప్రభాతం ప్రభూ!'

'చూశావా... పేపర్లో...'

'ఏమిటండీ—?'

'మెడ్రాసులో పాకీవాళ్ళు సమ్మె కట్టారుట—?'

'కావచ్చునండి.'

'పాకీవాళ్ళు!'

'చిత్తం—'

'వాళ్ల హక్కులను వాళ్ళు సంరక్షించుకుందుకు!'

'చిత్తం—'

'డాక్టర్లూ, ప్లీడర్లూ, రాజకీయవేత్తలూ, జర్నలిస్టులూ చేయలేని పనిని—'

'చిత్తం—'

'ఈ పాకీవాళ్ళు చేశారు!'

'చిత్తం! చేశేరండి—'

'మన రాజ్యంలో ఎప్పుడైనా ఎవరైనా సమ్మె కట్టారా?'

'లేదండి. ప్రభువుల హయాంలో అటువంటి...'

'ఎవళ్ళూ, ఎప్పుడూ సమ్మె చేయలేదూ మన సంస్థానంలో?'